క్లుప్తంగా

ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చాప బాబు దొర

గోవిందరావుపేట: హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఈ నెల 23న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు చాపబాబు దొర అన్నారు. మండల పరిధిలోని చల్వాయి ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు వాసుదేవరెడ్డి, హట్కర్ సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో చాప బాబుదొర మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలిపిన పరిష్కరించడంలేదన్నారు. దీంతో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

కాటారం: ఐటీఐ, ఏటీసీ కోర్సులు అభ్యసించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీఐ వరంగల్ రిజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.సీతా రాములు అన్నారు. మండల కేంద్రంలో కాటారం, పెద్దపల్లి, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్స్, ప్రచా రం బృందం, సిబ్బందితో కలిసి గురువారం ఆర్‌డీడీ ఐటీఐ విద్యపై అవగాహన కల్పించారు. ప్రధా న కూడలితో పాటు పీఏసీఎస్, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో ప్రజలు, యువతకు ఐటీఐ, ఏటీసీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న కోర్సులు, కాల వ్యవధి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాల గూర్చి వివరించారు. ఏటీసీ కోర్సుల ద్వారా స్వయం ఉపాధితో పాటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు వెంటనే లభిస్తాయని పేర్కొన్నారు. కాటారంలో ఐటీఐ, ఏటీసీ అందుబాటులో ఉన్నందున్న అర్హులైన విద్యార్థులు, యువత దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంకట్‌రెడ్డి, జుమ్లానాయక్, తిరుపతి, సిబ్బంది శ్రీనివాస్, మహేందర్, ప్రకాశ్, ప్రశాంత్, అభినవ్, సత్యనారాయణ, మధు, సందీప్‌కుమార్, సాయికిరణ్, సతీశ్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

కాటారం: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాటారం విద్యుత్‌శాఖ ఏఈఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, దేవరాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో విద్యు త్ ప్రమాదాలు అధికంగా నెలకొనే అవకాశం ఉంటుందని విద్యార్థులు, తమతో పాటు తమ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఏదైన విద్యుత్ ప్రమాదం సంభవించిన, విద్యుత్ తీగలు తెగిపడిన, షార్ట్ సర్క్యూట్ అయిన వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ మోటార్లు, విద్యుత్ తీగలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ట్రాన్స్‌కో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాం తనిఖీ

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల పీఏసీఎస్ గోదాంను మండల వ్యవసాయ అధికారి శ్రీజ, కొయ్యూరు ఎస్సై–2 రజన్‌కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాంలో యూరియా సరఫరాపై ఆరా తీశారు. స్టాక్ రికార్డులను పరిశీలించి, ఇప్పటి వరకు ఎంత మేరకు రైతులకు యూరియా అందించారో సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎ లాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. యూరియా అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

కూర్చనే స్థలం లేక బల్లపైనే పడుతున్న రోగులు



ఓపీ వద్ద బారులుదీరిన రోగులు



వణికిస్తున్న జ్వరాలు

- ఆస్పత్రికి క్యూ కడుతున్న ప్రజలు
- బెడ్లు లేక ఇబ్బందులు పడుతున్న రోగులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

వెంకటాపురం(కె): మండలంలో జ్వరం భయం వనికిస్తుంది. వాతావణంలో మార్పులతో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడుతున్నారు. వారం రోజులుగా మండలంలో వర్షాలు కురవడంతో జ్వర బాధితులు ఒక్కసారిగా పెరిగారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆస్పత్రికి ఓపీ రోజు 200 నుంచి 250 వరకు వస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 30 బెడ్ల రోగులకు చికిత్సకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బల్లపైనే పడుకున్నారు.

అపరిశుభ్ర వాతవారణంతోనే వ్యాధులు

మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో ఒక్కసారిగా వ్యాధులు విజృభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల భారిన పడుతున్నామని తెలుపుతున్నారు. మండలంలోని 18 పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, బావులు, మంచినీటి పథకాలలో క్లోరినేషన్ చర్యలు అధికారులు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు పారిశుద్ధ్య పనులు, క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఆహార పదార్థాలను తినొద్దు, కలుషిత నీటిని వాడొద్దు. జ్వరం వస్తే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలి. కాచి చలార్చిన నీటిని తాగునీటిగా ఉపయోగించుకోవాలి.

– యుడిస్టర్, వైద్యాధికారి

బెడ్లు లేక ఇబ్బందులు..



మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సౌకర్యాను పెంచాలి. వైద్యశాలలో రోగులకు సరిపడ పడకలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో వైద్యశాలలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– పర్శిక సతీశ్, ఆదివాసీ నాయకుడు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని నూగూరులో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి ఎవరైన జ్వరంతో బాధపడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోతి, ఆశీష్, భాస్కర్, హెచ్ఈఓ కోటిరెడ్డి, డీపీఎంఓ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడులో పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహేందర్



పేరూరులో పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాహిల్

- వైద్యాధికారి మహేందర్

వాజేడు: విద్యార్థులు వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వాజేడు వైద్యాధికారి కొమురం మహేందర్ అన్నారు. మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో వైద్యాధికారి మహేందర్, పేరూరు, శ్రీరామ్ నగర్ ఆశ్రమ హాస్టళ్లలో పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో విద్యార్థులను వైద్య పరీక్షించి నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందించారు. వంట గదులు, సరుకులను, వంటలను పరిశీలించారు. విద్యార్థులకు పలు సలహాలు, సూచనలను ఇచ్చారు.

కొమురంభీం నగర్‌లో వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏటూరునాగారం: మండలంలోని కొమురంభీం నగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క సమాజ సేవను ఆదర్శంగా తీసుకొని ఏటూరునాగారం ఆరాధ్య ఆరోగ్య ఆస్పత్రి యజమాన్యం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. 25 కుటుంబాలకు పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కల్యాణి, విష్ణు మోహన్, సారంగపాణి, నాగరాజు, గౌతమి, సిబ్బంది కవిత, నాయకులు గుడ్ల దేవేందర, ఖలీల్, వావిలాల నర్సింహారావు, నవీన్, పెద్ది రాజబాబు, చేల లక్ష్మీ, వినయ్, రాజేష్, కృష్ణ, ఠాగూర్, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



దేవగిరిపట్నంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొన్న రవిచందర్, కల్యాణి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు రూరల్: బంజారుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని దేవగిరిపట్నం, పత్తిపల్లి గ్రామాలలో నిర్వహించిన తీజ్ వేడుకలకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కల్యాణితో కలిసి హాజరయ్యారు. తొలుత దేవగిరిపట్నంలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఏర్పాటు చేసిన తీజ్ వేడుకల్లో తీజ్ బుట్టలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార యువతులు తొమ్మిది రోజులు నిష్టతో ఉండి తీజ్ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగమణి, దేవ్‌సింగ్, అభినయ్‌చారి, సారయ్య, భద్రు, బాల బ్రహ్మచారి, కిషన్ మహరాజ్, నిరంజన్, రాధిక, స్వర్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు గ్రంథాలయంలోని పుస్తకాల పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు. గ్రంథాలయం చుట్టూ చెత్తాచెదారం తొలగించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రఘు, నవీన్, లక్కి అక్షిత్, పెద్ది రాజ్‌కుమార్, దేవ్‌సింగ్, తరుణ్, కిరణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆధార్ సేవలు మరింత సులభం



మాట్లాడుతున్న దేవేందర్

ములుగు రూరల్: కొత్త ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో ఆధార్ సేవలు మరింత సులభతరం అవుతాయని ఈ డిస్టిక్ మేనేజర్ దేవేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కొత్త సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జిల్లాలో కొత్త ఆధార్ కేంద్రాలు ప్రారంభమవుతాయని అన్నారు. కొత్త ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో ఆధార్ సంబంధిత మొబైల్ నంబర్‌లింక్, చిరునామా నమోదు, పేరులో, పుట్టిన తేదీ సవరింపులు, కొత్త ఆధార్ కార్డు పలు సేవలు సులభతరం అవుతాయని అన్నారు. యుఐడీఏఐ హైదరాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పసుల రత్నాకర్ ప్రతి ఒక్క సర్వీస్‌పై ఆధార్ సెంటర్ నిర్వహకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీ సేవా జిల్లా మేనేజర్ విజయ్, టీజీ ఆన్‌లైన్ మేనేజర్ రాకేశ్ తదితరులు ఉన్నారు.

నీటిలోనే రహదారులు



వాజేడు: జాతీయ రహదారిపై వెళ్తున్న వరుద



వాజేడు: పేరూరు, కృష్ణాపురం మధ్య రహదారి



వాజేడు: నీటిలో మునిగిన వరి పొలం

వాజేడు: మండలంలో ఉధృతంగా ప్రవహించిన గోదావరి వరద పేరూరు వద్ద క్రమేపీ తగ్గుతూ వస్తోంది. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ గురువారం ఇంకా రహదారులు, వరి పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. టేకుల గూడెం వద్ద 163 జాతీయ రహదారి ముంపునకు గురి కావడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఏడ్జెర్లపల్లి- పూసూరు, పేరూరు- కృష్ణాపురం, జాతీయ రహదారి నుంచి కోయవీరాపురం, వాజేడు- గుమ్మడి దొడ్డి గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గుముఖం పట్టినప్పటికీ వరి పొలాలు ఇంకా బయట పడలేదు.

తగ్గుముఖం పట్టిన గోదావరి



వెంకటాపురం(కె): బోదాపురం వద్ద వరదలో రోడ్డు దాటుకుంటు వస్తున్న ప్రయాణికులు

వెంకటాపురం(కె): మండలంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. కాగా, బోధాపురం, కొండాపురం గ్రామ సమీపంలోని వాగులపై నిలిచిన గోదావరి వరద పూర్తిగా తగ్గలేదు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చే వారు బోదాపురం వద్ద వాగుపై ఉన్న వరద నీటిలో దాటుకుంటు ఆలుబాక చేరుకోని అక్కడ నుంచి మండల కేంద్రానికి చేరుకుంటున్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

వాజేడు: వినాయక చవితి నవరాత్రుల కమిటీల సభ్యులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ అన్నారు. పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి నవరాత్రులను నిర్వహించే గ్రామాలకు సంబంధించిన కమిటీల సభ్యులతో గురువారం మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో నవరాత్రులను చేసుకోవాలని, డీజేలు పెట్టవద్దని సూచించారు. పోలీస్‌శాఖ సూచించిన వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

ఘనంగా పొట్ట పండుగ



పొట్ట పండుగ చేస్తున్న గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి గ్రామంలో గురువారం ఘనంగా పొట్ట పండుగను నిర్వహించారు. గ్రామస్తులు గ్రామంలోని గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, బొడ్రాయి మైసమ్మ, సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గుడిని శుద్ధి కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. అనంతరం వరి పొలంలోకి వెళ్లి పొట్ట దశలో ఉన్న వరిని ఎంచుకోని పూజలు చేసి వరిని గుడిలోకి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో మొదటిగా పండించిన మొక్కజొన్న, కూరగాయలను తీసుకువచ్చి గుడిలో పూజ కార్యక్రమాలు చేసి పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు చేల చినవీరయ్య, సోనప పగిడయ్య, చేల వెంకటేశ్, నాగేంద్ర ప్రసాద్, నవీన్, తలపతి చేల నర్సయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

కన్నాయిగూడెం: మండలంలోని గుర్రేవుల గ్రామానికి చెందిన బొగ్గుల ముత్తయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబు పంపించిన రూ.5 వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. మండల టౌన్ అధ్యక్షుడు మఠం వెంకటేష్, పూజరి కిషోర్, కావిరి చిన్నకృష్ణ, తడకల జగన్, శ్రీరాముల వెంకన్న, పాలకుర్తి వెంకన్న, లక్ష్మీనారాయణ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న రమణ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం మాజీ జెడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన వీరబ్రమ్మయ్య, మర్రిగూడెం గ్రామానికి చెందిన బోల్లే కోటేశ్వరావు, ఉప్పేడు వీరాపురం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దుకూరి ప్రసాద్, బాలసాని వేణు, తదితరులు ఉన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక లారీల పార్కింగ్



కమలాపురంలో ప్రధానరోడ్డుకు ఇరువైపులా నిలిపిన లారీలు



మంగపేట మార్కెట్ యార్డులో నిలిపిన లారీలు

మంగపేట: మండలంలో ఇసుక క్వారీలకు వచ్చే ఇసుక లారీలను ప్రధాన రోడ్డుతో పాటు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మల్లూరు, వాడగూడెం ఇసుక క్వారీలకు వచ్చిన సుమారు 200 పైగా లారీలను ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై గురువారం నిలిపి ఉంచారు. క్వారీలలో రెండు రోజుల పాటు లోడింగ్ నిలిపి వేయడంతో లారీ యజమానులు, డ్రైవర్లు లారీలను రాజుపేట నుంచి కమలాపురం వరకు పలు చోట్ల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా, మంగపేట మార్కెట్ గోడౌన్ ఆవరణ, బరోరునర్సాపురం సీతారామాంజనేయ ఆలయం పక్కన, మల్లూరు, రాజుపేట తదితర ప్రాంతాల్లో లారీలను ఎక్కడ పడితే అక్కడ నిలిపారు. లారీలను ఇష్టారాజ్యంగా రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ రోడ్డుపై నిలిపి ఉంచడంతో ప్రమదాలు జరుగుతున్నాయి. ఇటీవల చుంచుపల్లికి చెందిన ఓ పోస్టల్ ఉద్యోగి, రమనక్కపేటకు చెందిన మరో వ్యక్తి గాయాలయ్యాయి. మార్కెట్ యార్డులో ఇసుక లారీల కారణంగా ప్రధాన గేటు ధ్వంసమైంది. సంబంధిత అధికారులు స్పందించి లారీలను రోడ్డుపై, ప్రభుత్వానికి చెందిన స్థలాల్లో పార్కింగ్ చేయకుండా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.